



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

నేటి సందేశం కాదు రేపటి పొద్దు జాడ — 20 YEARS ANNIVERSARY

https://www.satyamdaily.net/

శుక్రవారం 8-8-2025

సంపుటి: 21 సంచిక: 117

పేజీలు: 8 వెల: రూ.1


# ఆమె దర్శనం దుర్లభం!

- ఏడాదిగా జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ
- విజయనగరం డీఐజీకి అదనపు బాధ్యతలు
- ఎప్పుడు వస్తారో సిబ్బందే చెప్పలేని దుస్థితి
- ఫైల్స్, కార్యకలాపాలన్నీ పెండింగ్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కీలకమైన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఏడాది నుంచి ఖాళీగా ఉంది. అంతకుముందు సుమారు ఏడాది క్రితం జిల్లా రిజిస్ట్రార్‌ను ఇక్కడినుంచి బదిలీ చేసిన ఉన్నతాధికారులు ఆ స్థానాన్ని భర్తీ చేయకుండా విజయనగరంలో డీఐజీగా ఉన్న నాగలక్ష్మికి అదనపు బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకొన్నారు. ఆ మేరకు ప్రతి మంగళవారం ఆమె విజయనగరం నుంచి ఇక్కడికి వచ్చి విధులు నిర్వస్తున్నట్టు స్థానిక అధికారులు చెబుతున్నా నెలలో ఒకటి రెండు మంగళవారాల్లో మిగతా రోజుల్లో ఆమె అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో మంగళవారం కాకుండా వేరే రోజుల్లో వస్తున్నారు. ఈ విషయం తెలియక జిల్లా రిజిస్ట్రార్‌తో పనులు ఉన్న ప్రజలు ఆమె కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. డీఐజీ నాగలక్ష్మి ఇక్కడికి రాలేని రోజుల్లో శ్రీకాకుళం సబ్‌రిజిస్ట్రార్-1 సురేష్ ఇన్‌ఛార్జి జిల్లా రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే ఇన్‌ఛార్జి హోదాలో ఆయనకు పరిమిత అధికారాలే ఉంటాయి. కొన్ని ఫైల్స్‌పై జిల్లా రిజిస్ట్రార్ మాత్రమే సంతకాలు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అటువంటి అవసరాలు ఉన్న దరఖాస్తుదారులు ఆమె కోసం ఎదురుతెన్నులు చూడాల్సి వస్తోంది. మరోవైపు జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యకలాపాలు కుంటుపడుతున్నాయని, జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణను గాలికొదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

భూమి, భవనాలు వంటి భారీ స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అన్ని రకాల పత్రాలను పరిశీలించి నిర్ధారించడం, నమోదు చేయడం వంటి పనులను జిల్లా రిజిస్ట్రారే చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చట్టాల ప్రకారం నోటరీ, సొసైటీ, ట్రస్టు, ఫర్మ్‌రిజిస్ట్రేషన్, ఆడిట్‌లు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, స్పాట్ తదితర విధులు కూడా నిర్వర్తించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా రిజిస్ట్రార్‌పైనే ఉంటుంది. రిజిస్ట్రేషన్ చట్టాలను ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొనే అధికారం జిల్లా రిజిస్ట్రార్‌కు ఉంటుంది. జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనితీరును పర్యవేక్షించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాల్సి ఉంటుంది.

జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో ఒక్కో పనికి ఒక్కో అకౌంట్ ఉంటుంది. వీటన్నింటినీ రిజిస్ట్రార్ ప్రతిరోజూ పరిశీలించి నివేదికలు తయారుచేసి భద్రపరచాల్సి ఉంటుంది. అయితే ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా ఉన్న నాగలక్ష్మి ఇక్కడికి రాకుండానే ఈ పనులన్నింటినీ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందే చక్కబెట్టేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రార్ అందుబాటులో లేకపోవడంతో చాలా ఫైల్స్ పెండింగ్‌లో ఉండిపోతున్నాయని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి పలుమార్లు వెళ్లినా ఎవరూ పెద్దగా స్పందించడం లేదని జిల్లా రిజిస్ట్రార్ ఎప్పుడు వస్తారో కచ్చితంగా చెప్పలేమని చేతులెత్తేస్తున్నారని విమర్శిస్తున్నారు.

- గిరిజన సంక్షేమ శాఖలోనే రికార్డుస్థాయిలో వసూళ్ల దందా
- కాంట్రాక్టర్లతో తెరవెనుక వ్యాపార భాగస్వామ్యం
- ఆ విభేదాల నేపథ్యంలోనే లంచం పేరుతో ఏసీబీకి ఉప్పు
- మామూళ్ల కోసం సొంత సిబ్బందినే వేధించిన ఈఎన్‌సీ
- ఈ కేసులో తామెక్కడ దొరికిపోతామేమోనని వారి ఆందోళన



# కప్పం కాసులవాడు.. ఈ శ్రీనివాసుడు!

సత్యంన్యూస్, శ్రీకాకుళం

రాష్ట్ర చరిత్రలోనే ఇంతకుముందెన్నడూ లేనివిధంగా ఏకంగా రూ.25 లక్షలు లంచంగా తీసుకుంటూ ఒక చీఫ్ ఇంజినీర్ దొరికిపోవడం ఒక సంచలనమైతే.. అయ్యగారు దొరికిపోవడం ఆయన కింద పనిచేసే ఇంజినీరింగ్ అధికారులను బెంబేలెత్తిస్తుండటం విశేషం. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) సబ్బవరపు శ్రీనివాస్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసు ఆ శాఖలోని పలువురు ఇంజినీరింగ్ ఉద్యోగుల్లో కలవరం రేపుతోంది. తన కిందిస్థాయి ఇంజినీరింగ్ సిబ్బంది ఎవరైనా.. ఎప్పుడు విధుల్లో చేరినా.. ఏ మాత్రం మొహమాటం లేకుండా ఫలానా మొత్తం వసూలు చేసి తనకు కప్పం కట్టాలని ఆదేశించడం.. దాన్ని పాటించని వారిని వేధించి, చిత్రవధ చేసిన ఈఎన్‌సీ సబ్బవరపు శ్రీనివాస్ ఒక కాంట్రాక్టర్‌కు రూ.35.5 కోట్ల బిల్లు చెల్లింపునకు రూ.5 కోట్లు లంచం డిమాండ్ చేశారు. అడ్వాన్స్‌గా రూ.25 లక్షలు తీసుకుంటూ దొరికిపోవడంతో ఈఎన్‌సీ కోసం కాంట్రాక్టర్ల వద్ద ముక్కుపిండి మరీ వసూలుచేసిన ఇంజినీరింగ్ సిబ్బందికి దడ పట్టుకుంది. ఈ ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖలో పెద్ద సంచలనమైంది. విశాఖకు చెందిన సత్యసాయి కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకుడు చెరుకూరి కృష్ణంరాజు ఏడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను కాంట్రాక్టు పద్ధతిలో నిర్మించారు. దీనికి సంబంధించి రూ.35.5 కోట్ల వరకు బిల్లులు ఆయనకు రావాల్సి ఉంది. ఈ బిల్లు మంజూరు చేయాలని ఈఎన్‌సీని కోరగా రూ.5 కోట్ల ముడుపు కడితేనే బిల్లు ఓకే చేస్తానని ఆయన భీష్మించుకు కూర్చున్నారు. దాంతో కాంట్రాక్టర్ కృష్ణంరాజు ఏసీబీని ఆశ్రయించి

- మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# ప్రగతి సరే.. మానవీయత ఎక్కడ!

మనది ప్రధానంగా సంక్షేమ రాజ్యం. రాజ్యాంగ మూలసూత్రాల్లోనే దీన్ని పొందుపరిచారు. అందువల్ల అటు జాతీయస్థాయిలోనైనా.. ఇటు రాష్ట్రాలస్థాయిలోనైనా.. అభివృద్ధితోపాటు సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రెండింటితో జోడుగుర్రాల మీద స్వారీలా నడిపించాల్సిన బాధ్యత ప్రజా ప్రభుత్వాలపై ఉంటుంది. ఏ ఒక్కటి లోపించినా సమతుల్యత దెబ్బతింటుంది. పరిస్థితి గాడి తప్పుతుంది. సంక్షేమంలో మానవీయ కోణం ఉన్నట్లే.. ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి పనుల్లోనూ మానవీయ కోణం ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. అంటే ప్రజలకు ఏది ఎక్కువ మేలు చేస్తుందో ఆలోచించి అటువంటి అభివృద్ధి పనులు చేపట్టడమే మానవీయ కోణంగా చెప్పాలి. ప్రజలకు పెద్దగా ఉపయోగపడని అభివృద్ధి అడవిగాచిన వెన్నెలగా మారిపోతుంది. ఇప్పుడు మన రాష్ట్రంలో అదే జరుగుతోందా? అన్న అనుమానాలు మొదలయ్యాయి. గత వైకాపా సర్కారు సంక్షేమానికి పెద్దపీట వేసి.. అభివృద్ధిని అటకెక్కించిందన్న విమర్శలు ఉన్నాయి. ఆ సర్కారు గద్దె దిగిపోవడానికి ఇది కూడా ఒక కారణమేనని చెప్పాలి. అయితే సంక్షేమం, అభివృద్ధిని సమానంగా సాగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు అభివృద్ధి పనుల విషయంలో దూకుడుగా ముందుకెళుతోంది. అందులో మానవీయ కోణాన్ని విస్మరిస్తోందన్న విమర్శలు ఎదుర్కొంటోంది. విశాఖ, విజయవాడ నగరాల్లో అత్యంత విలువైన స్థలాలను షాపింగ్‌మాల్స్ ఏర్పాటుకోసం దుబాయ్‌కి చెందిన లులూ ఇంటర్నేషనల్ షాపింగ్‌మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించింది. విశాఖలో బీచ్‌రోడ్డు సమీపంలోని హార్బర్ పార్క్ వద్ద ఉన్న ఏపీఐఐసీకి 13.43 ఎకరాలను 99 ఏళ్లకు, అలాగే విజయవాడలో రద్దీ ప్రాంతంలో ఉన్న ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాలను 33ఏళ్లకు కారుచౌక లీజు రేటుకు కేటాయించారు. అంతేకాకుండా ఈ షాపింగ్ మాల్స్ ప్రారంభమయ్యే వరకు లేదా మూడేళ్ల వరకు అద్దె చెల్లింపు నుంచి అతి ఉదారంగా మినహాయింపు కూడా ఇచ్చారు. ఈ షాపింగ్ మాల్స్ ద్వారా చాలామందికి ఉపాధి లభిస్తుందని, ఆధునిక షాపింగ్, వినోద సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం చెబుతోంది. తద్వారా చంద్రబాబు పదే పదే ఉవాచించే సంపద సృష్టి కూడా జరుగుతుందని ప్రభుత్వవర్గాలు చెప్పుకొస్తున్నాయి. కానీ వాస్తవ దృష్టితో చూస్తే ఇవి జరిగేవి కావన్నది అర్థమవుతుంది. దీనివల్ల యజమానులకు తప్ప ప్రభుత్వం, ప్రజలకు ఉపకరించే సంపద సృష్టి జరిగే అవకాశం లేదు. ఎందుకంటే లులూ గ్రూప్ విదేశానికి చెందిన ప్రైవేట్ సంస్థ. ఆస్తులు కూడబెట్టుకోవడం, లాభాలను తమ దేశానికి తరలించుకుపోవడమే దాని ధ్యేయం అని చెప్పక తప్పదు. ఇక షాపింగ్ మాల్స్ వల్ల వందలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నది కూడా పాక్షిక నిజమే. సాంకేతికత, ఆటోమేషన్ కారణంగా పరిశ్రమలతో పాటు వాణిజ్య సంస్థల్లోనూ మానవ వనరులు వినియోగం క్రమంగా తగ్గిపోతోంది. ఐకియా వంటి భారీ మాల్స్ తక్కువ స్టాఫ్‌తోనే అమ్మకాలు చేస్తున్నాయి. బిల్లింగ్ కౌంటర్లతో పాటు చాలా విభాగాల్లో యంత్రాలతోనే పనులు జరిపిస్తున్నారు. భారీ మాల్స్‌లో వ్యాపారాలు జరిగినంతగా ఉపాధి దొరకదు. ఉద్యోగాలు, సంపద సృష్టి సంగతి పక్కనపెట్టినా.. భారీమాల్స్ వల్ల రిటైల్ మార్కెట్ దారుణంగా దెబ్బతింటోంది. గ్రామాలు, చిన్న పట్టణాలు ఎక్కువగా కలిగిన మనదేశంలో వేలు, లక్షల సంఖ్యలో ప్రజలు వీధి చివర బళ్లు, చిన్న చిన్న షాపులు పెట్టుకుని చిల్లర వ్యాపారం చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వీరే ఊతంగా నిలుస్తున్నారు. అలాగే కిరాణ కొట్టు నుంచి, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, రెడీమేడ్ వస్త్రాలు, హస్తకళలు.. ఇలా ఎన్నో రంగాలకు చెందిన చిన్న, మధ్య తరగతి వ్యాపారులు ఈ షాపింగ్‌మాల్స్ వల్ల నష్టపోతారు. కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు షాపింగ్ మాల్స్ అనే తిమింగలాలు మొత్తం అన్ని రంగాల వ్యాపారాన్ని తామే మింగేసి చిన్న చేపల కడుపుకొట్టినట్లవుతుంది. ఇప్పటికే రిలయన్స్, డిమార్ట్ వంటి ఓ మోస్తరు సైజులో ఉండే సూపర్ మార్కెట్ల వల్ల వేలాది చిన్న షాపులు మూతపడ్డాయి. అభివృద్ధి గురించి మానవీయ కోణం నుంచి ఆలోచించి సంప్రదాయ చిరు వ్యాపారరంగాన్ని ఆదుకోవాల్సింది పోయి.. వినోదం, షాపింగ్ అనుభూతి.. అన్నీ ఒకే చోట అని ఊరిస్తూ.. దానికే అభివృద్ధి పూత పూసి.. ఆ ముసుగులో వందల కోట్ల విలువైన భూములను బడాబాబులకు కారుచౌకగా కట్టబెట్టడం.. వాటికి అద్దె మినహాయింపులు కూడా ఇవ్వడాన్ని అనుత్పాదక పెట్టుబడిగానే పరిగణించాల్సి ఉంటుంది. కాకుల్ని కొట్టి గద్దలకేయడం ఏ రకమైన అభివృద్ధో పాలకులే చెప్పాలి.

## నాణ్యతగల ఖాదీకి ప్రసిద్ధి "సిక్కోలు"



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నాణ్యతగల ఖాదీకి ప్రసిద్ధి శ్రీకాకుళం (సిక్కోలు) అని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సిందూర అన్నారు. మండలం అక్కులపేట గ్రామంలో చేనేత కుటుంబాలను కలసి, వాటి ప్రాముఖ్యత వివరాలను, వస్త్రాలు నేసే విధివిధానాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళంలోని "చేనేత" ఖాదీకి దేశవ్యాప్తంగా మంచి పేరుందన్నారు. శ్రీకాకుళం అధిక నాణ్యత గల ఖాదీకి ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు. చేతితో వడికి, నేసిన ఖాదీకి జాతీయ గుర్తింపును పొందిందన్నారు. ఇక్కడ ఉత్పత్తి చేయబడిన ఖాదీని మహాత్మాగాంధీ స్వయంగా ఆదరించారన్నారు. చేనేత నైపుణ్యాలను వెలికితీసి, వారికి అవసరమైన సహకారం అందిస్తామని, యువతలో అవగాహనపెంచి, ఖద్దర్ ప్రాముఖ్యతను, జిల్లాఖ్యాతిని దేశనలుమూలలకు విస్తరింపజేయటంలో భాగమౌతామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మాలతి, కార్యదర్శి టీ.రామ్‌గోపాల్, డైరెక్టర్ మాధురి, సభ్యులు శ్రీనివాసరావు, ఎన్.రేణుక లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమదాలవలస ట్రెజరర్ పొన్నాడ రోషిణి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహా సంపద

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆరోగ్యమే మహా భాగ్యం, మహా సంపదని డాక్టర్ ఇంజరాపు మోహనరావు శుక్రవారం అన్నారు. పేదప్రజల వైద్యులుగా సుస్థిర స్థానం సంపాదించుకున్న డా.ఇంజరాపు మోహనరావు, పేద ప్రజల కోసం, ముఖ్యంగా మహిళల ఆరోగ్యం కోసం ప్రతి శుక్రవారం అరసవల్లిలో డా.మోహనరావు(క్లినిక్) పేరుతో ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ ఉచిత మందులను అందిస్తున్నారు. జేమ్స్ హాస్పిటల్ అధర్యంలో ప్రతి శుక్రవారం 10గంటల నుండి 12 గంటల వరకు స్త్రీలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని, ప్రముఖ వైద్యులు వై.భవ్యశ్రీ అందుబాటులో ఉంటారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని, జేమ్స్ మదర్ అండ్ చైల్డ్ ఎగ్జిక్యూటివ్ వెంకుమహంతి లక్ష్మణరావు తెలిపారు. నేడు నిర్వహించిన ఉచితవైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని, పేదలు, నిస్సహాయులు, మహిళలు ఉచిత వైద్య శిబిరానికి హాజరై, వైద్య పరీక్షలు జరిపించుకున్నారని, అవసరమైన వారికి ఉచిత మందులను అందజేశామన్నారు. కార్యక్రమంలో జేమ్స్ వైద్య బృందం, మోహనరావు(క్లినిక్) బృందం, సహాయక సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.



## కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోకు భూములిచ్చిన దళిత కార్మికుల పొట్టకొట్టవద్దని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో మరో మద్యం డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గత 10 రోజులుగా ఆందోళన చేస్తున్న హమాలీలు శుక్రవారం కళ్ళకు గంతలు కట్టుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఎచ్చెర్ల డిపోను యధావిధిగా కొనసాగించి దళితులు,పేదలుగా ఉన్న హమాలీల ఉపాధిని కాపాడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమా లీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు నాయకులు టి.రామారావు, ఎన్.సురేష్, ఎన్.రమణ, బోనెల రాము, పి.రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కె.వి.రమణ, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## క్విట్ కార్పొరేట్ డేను జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న మోడీ విధానాలకు నిరసనగా ఈనెల 13న క్విట్ కార్పొరేట్ డే ను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి. ప్రసాదరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బొత్స. సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి.చందు, పి.కగేష్‌లు పిలుపునిచ్చారు. ఈమేరకు సిటు కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడవసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం రద్దయిన మూడు నల్ల చట్టాల కన్నా ప్రమాదకరమైన విధానాలను ప్రకటించిందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ల చట్టాన్ని విదేశీ, స్వదేశీ కంపెనీల ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేసిందన్నారు. ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానం ఉండదన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని, మన ప్రభుత్వం ఇప్పటికి 4సార్లు చర్చలు జరిపిందని, 5వ సారి చర్చలకు అమెరికా అధికారులు రాబోతున్నారని, మన దిగుమతి చేసుకునే వస్తువులపై పన్నులు తగ్గించాలని, మనం ఎగుమతి చేసే వస్తువులపై సుంకాలు పెంచాలని బహిరంగంగానే ఒత్తిడి చేస్తున్నారని, అనేక దేశాలు వ్యతిరేకిస్తున్నాయని,మన ప్రభుత్వం ఎదురు చెప్పకుండా చర్చలు సాగిస్తుందని విమర్శించారు. ఇటువంటి విధానాలను నిరసిస్తూ ఈనెల 13న చేపట్టనున్న క్విట్ కార్పొరేట్ డేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

**కథ:** చిత్తూరు జిల్లాలోని నర్సిపల్లిలో ఓ దిగువ మధ్య తరగతిలో పుట్టిన కృష్ణమ నాయుడు (ఆది పినిశెట్టి)కు కాలేజీ రోజుల నుంచే రాజకీయాల్లో ఎదిగిపోవాలని కోరిక. ఇంట్లో పరిస్థితులు అనుకూలించకపోయినా పీజీ పూర్తి చేసిన అతను.. ఆ తర్వాత కూడా తండ్రి అభీష్టానికి వ్యతిరేకంగా పీహెచ్డీలో చేరి స్టూడెంట్స్ పాలిటిక్స్ లోకి అడుగు పెడతాడు. కానీ అక్కడ ఏదీ అతను అనుకున్నట్లుగా జరగదు. రాజకీయాల్లో అడుగడుగునా ఎదురు దెబ్బలు తగులుతాయి. తాను ప్రేమించిన అమ్మాయి కూడా దూరం అవుతుంది. మరోవైపు కడప జిల్లాకు చెందిన ఎంఎస్ రామిరెడ్డి (చైతన్య రావు) ఎంబీబీఎస్ చదువుతుంటాడు. అతడికి పెద్ద డాక్టర్ కావడం మీదే దృష్టి ఉంటుంది. కానీ కొడుకును రాజకీయ నేతగా చూడాలన్నది అతడి తండ్రి కల. కానీ తండ్రికి గూండాగా పేరుండడంతో.. రామిరెడ్డి రాజకీయాల్లోకి రావాలని చూసినా అడ్డంకులు తప్పవు. మరి అనుకోకుండా మిత్రులుగా మారిన కృష్ణమ నాయుడు-రామిరెడ్డి.. ఒకరికొకరు సహకారం అందించుకుంటూ రాజకీయాల్లో ఎలా ఎదిగారు.. సవాళ్లను ఎలా ఛేదించారు.. వీరి ప్రయాణం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ఎలాంటి మలుపు తిప్పింది అన్నది మిగతా కథ.

చేసినవి తక్కువ సినిమాలే అయినా గొప్ప అభిరుచి, విషయ పరిజ్ఞానం ఉన్న దర్శకుడిగా పేరు తెచ్చుకున్నాడు దేవా కట్టా. ప్రస్థానం.. రిపబ్లిక్ లాంటి చిత్రాలతో పొలిటికల్ థ్రిల్లర్ల తీడయంలో తన నైపుణ్యాన్ని ఆయన చాటాడు. ఇప్పుడాయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను శాసించి నాయకుల కథను 'మయసభ' వెబ్ సిరీస్ ద్వారా తెరపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. సోనీ లివ్ ద్వారా ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సిరీస్ విశేషాలేంటో చూద్దాం పదండి.




# మ్యాజిక్ చేసింది!

**నటీనటులు:**

'మయసభ'లో ప్రధాన పాత్రలు పోషించిన ఇద్దరు నటులూ పోటాపోటీగా నటించారు. ఆది పినిశెట్టి చంద్రబాబు పోలినట్లు కనిపించలేదు. హావభావాల్లో ఆయన్ని అనుకరించడానికీ ప్రయత్నించలేదు. కానీ చంద్రబాబు ఆలోచన విధానం ప్రతిబింబించేలా ఆ పాత్రను పోషించాడు. కానీ రాజకీయాల్లో ఎదగాలని తపించే యువకుడి పాత్రలో ఒదిగిపోయాడు. సిరీస్ ఆద్యంతం ఒక ఇంటెన్సిటీ మెయింటైన్ చేశాడు ఆది. ఇక చైతన్య రావుకు నటుడిగా ఇది కెరీర్ బెస్ట్ అని చెప్పొచ్చు. ట్రైలర్ చూస్తే ఇతను వైఎస్ పాత్రలో మెప్పించగలడా అని సందేహాలు కలిగాయి కానీ.. సిరీస్ లో మాత్రం అతను అంచనాలను మించిపోయాడు. వైఎస్ ను గుర్తుకు తెచ్చేలా నటించాడు. పాత్రలో పరిణామ క్రమాన్ని అతను తన నటనతో బాగా చూపించాడు. చివరి రెండు మూడు ఎపిసోడ్లలో చైతన్యరావు నటన మరింత మెప్పిస్తుంది. తమిళ అమ్మాయి తన్య రవిచంద్రన్ ఓ ముఖ్య పాత్రలో రాణించింది. ఎన్టీఆర్ పాత్రలో సాయికుమార్ అదరగొట్టాడు. ఇందిరా గాంధీగా దివ్య దత్తా లుక్ సరిపోనప్పటికీ.. ఆమె నటన మాత్రం బాగుంది. సంజయ్ గాంధీ పాత్రలో చేసిన నటుడూ ఆకట్టుకున్నాడు. శ్రీకాంత్ అయ్యంగార్.. రవీంద్ర విజయ్.. శత్రు.. వీళ్లంతా కూడా బాగా చేశారు. రామోజీ రావు పాత్రలో నాజర్ ఓకే అనిపించారు.

'మయసభ'లో చూపించిందంతా కూడా నిజం అని చెప్పలేం.. ఎగ్జాజరేషన్లు లేవని కాదు.. ఈ టీం పొలిటికల్ కరెక్ట్‌నెస్ కోసం ప్రయత్నించలేదని కాదు. కానీ ఉన్నంతలో వాస్తవికంగా ఆయా నాయకుల జీవితాలను చూపిస్తూ.. సమతూకం పాటిస్తూ.. అదే సమయంలో వారి కథలను ఆసక్తికరంగా తెరపై ప్రెజెంట్ చేయడంలో దేవా కట్టా అండ్ కో విజయవంతం అయింది. ఇదొక కల్పిత కథ అని.. ఇందులోని పాత్రలను ఎవరినీ పోలినవి కాదని.. అలాంటి పోలికలేమైనా కనిపించినా అది కాకతాళీయమని.. రాజకీయ చిత్రాలకు వేసే డీఫాల్ట్ డిస్క్లైమర్ దీనికి కూడా వేశారు కానీ.. ఈ సిరీస్ టైటిల్ పక్కన కనిపించే క్యారికేచర్ రూపాలను చూస్తేనే ఏ ఇద్దరు నాయకుల కథ అన్నది అర్థమైపోతుంది. ఆది పినిశెట్టి చేసిన కృష్ణమనాయుడు పాత్ర చంద్రబాబు నాయుడిదైతే.. చైతన్యరావు పోషించిన ఎంఎస్ రామిరెడ్డి క్యారెక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ఉద్దేశించింది. కళాశాల స్థాయి నుంచి మొదలుపెట్టి.. రాజకీయాల్లో మంత్రుల స్థాయికి ఎదిగే వరకు వీరి జీవితాలను ఈ సిరీస్ లో చూడొచ్చు. ఈ క్రమంలో ఇందిరా గాంధీ.. సంజయ్ గాంధీ.. నాదెండ్ల భాస్కర రావు.. ఎన్టీఆర్.. పరిటాల రవి.. వంగవీటి రాధా లాంటి ఆ తరం ముఖ్య రాజకీయ నేతలందరి పాత్రలు.. వారికి సంబంధించిన కీలక రాజకీయ పరిణామాలను ఇందులో చూస్తాం.

**సాంకేతిక వర్గం:**

టెక్నికల్‌గా 'మయసభ' ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కింది. వెబ్‌సిరీస్ అయినా సినిమాకు ఏమాత్రం తక్కువ కాని క్వాలిటీ కనిపిస్తుంది. ప్రతి ఎపిసోడ్లో భారీతనానికి లోటు లేదు. 70-80 దశకాల వాతావరణాన్ని చూపించడంలో శ్రమ తెరపై కనిపిస్తుంది. శక్తికాంత్ కార్తీక్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. పాటలు అంతగా మెప్పించవు. సురేష్ రగుతు.. జ్ఞానశేఖర్ కలిసి అందించిన ఛాయాగ్రహణం చాలా బాగుంది. దేవా కట్టా రైటింగ్ సినిమాకు మేజర్ హైలైట్. వాస్తవ ఘటనలు.. కల్పిత అంశాలతో సిరీస్ చాలా ఇంట్రెస్టింగ్ గా నడిపించాడు. తన మాటలు తూటాల్లా పేలాయి. దేవా-కిరణ్ జై కుమార్ దర్శకత్వం కూడా ఆకట్టుకుంటుంది. ప్రతి ఎపిసోడ్ బోర్ కొట్టకుండా నడిపించారు. నడిపించారు. స్క్రీన్ ప్లే బాగా తీర్చిదిద్దుకున్నారు. టేకింగ్ కూడా ఇంట్రెస్టింగ్ గా సాగింది.

**కథనం-విశ్లేషణ:**

ఒక ఎన్టీఆర్.. ఒక చంద్రబాబు నాయుడు.. ఒక వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. ఒక పరిటాల రవి.. ఒక వంగవీటి రాధా.. 70వ దశకం నుంచి ఓ పాతికేళ్ల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై అత్యంత ప్రభావం చూపిన నాయకుల జాబితా ఇది. వీళ్లందరి మీదా విడివిడిగా సినిమాలు చూశాం. ఎన్టీఆర్ మీద ఆయన తనయుడు బాలకృష్ణ ప్రధాన పాత్రలో 'యన్.టి.ఆర్' సినిమా తీశారు. వైఎస్ కథతో 'యాత్ర' సినిమా వచ్చింది. పరిటాల రవి మీద 'రక్త చరిత్ర'.. వంగవీటి రాధా మీద 'వంగవీటి' లాంటి చిత్రాలు వచ్చాయి. చంద్రబాబు మీద కూడా ఒక అన్ పాపులర్ సినిమా వచ్చింది. పైన చెప్పుకున్న కొన్ని సినిమాల్లో ఆయన పాత్రను కీలకంగా చూపించారు. ఐతే ఆయా నాయకుల కథలతో వచ్చిన సినిమాలు వారికి అనుకూలంగా.. వారి దృక్కోణంలోనే సాగాయి. వాటిలో ఆ నేతలను గొప్పగా చూపించి.. అవతలి నాయకులను కొంచెం తక్కువ చేసి చూపించడం చూశాం. అందుకే ఎవరికి అనుకూలంగా వాళ్లు సినిమాలు తీసుకున్నారంటూ వాటి మీద 'ప్రాపగండా' ముద్ర పడింది. అలా కాకుండా అందరి పాత్రలను వాస్తవానికి దగ్గరగా చూపిస్తూ.. అందరినీ ఎలివేట్ చేస్తూ.. సమతూకం పాటిస్తూ సాగిన సినిమా దాదాపుగా ఏదీ లేదనే చెప్పాలి. అలా అందరి పాత్రలను బ్యాలెన్స్ చేయడం అసాధ్యం అనే అనుకున్నారంతా! కానీ దేవా కట్టా అసాధ్యం అనుకున్న ఈ విషయాన్ని 'మయసభ'లో సుసాధ్యం చేసి చూపించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత కీలక పరిణామాలు.. అనూహ్యమైన మలుపులు చోటు చేసుకుందే 1970-2000 మధ్య. కొన్ని తరాలను ప్రభావితం చేసే స్థాయి నాయకులు తెరపైకి వచ్చింది కూడా ఆ కాలంలోనే. కాబట్టి నాటి రాజకీయ పరిణామాలను.. ఆ నాయకుల కథలను ఆసక్తికరంగా ప్రెజెంట్ చేసే ప్రయత్నం చేసింది దేవా కట్టా అండ్ కో. చంద్రబాబు.. వైఎస్ జీవితాలకు సంబంధించి జనబాహుళ్యంలో ప్రచారంలో ఉన్న విషయాలతోపాటు తెలియని సంగతులు.. అలాగే కొన్ని కల్పిత అంశాలను జోడించి ఆసక్తికర స్క్రీన్ ప్లేతో ఈ సిరీస్‌ను నడిపించారు. అక్కడక్కడా కొన్ని సీన్లు కొంచెం నాటకీయంగా.. వాస్తవ విరుద్ధంగా అనిపించినా సరే.. డ్రామాను రక్తి కట్టించడంలో దేవా కట్టా అండ్ టీం విజయవంతం అయింది. తొమ్మిది ఎపిసోడ్లతో దాదాపు ఆరు గంటలకు పైగా నిడివితో సాగే సిరీస్ లో బోరింగ్ అని ఏ ఎపిసోడ్ అనిపించదు. ప్రతి ఎపిసోడ్ ఒక ఎత్తుగడతో మొదలై.. షార్ప్ ఎండింగ్ తో తర్వాతి ఎపిసోడ్ మీద క్యూరియాసిటీ పెంచేలా సాగుతాయి. తెలిసిన సన్నివేశాలను కూడా ఆసక్తిగా చూసేలా ప్రెజెంట్ చేశారు. తెలియని సీన్లు మరింత క్యూరియస్ గా అనిపిస్తాయి. కులం చుట్టూ తిరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయం గురించి చాలా ఓపెన్ గానే చర్చించారిందులో. ఈ విషయంలో ముసుగులో గుద్దులాట లాంటిదేమీ లేదు. కులం ప్రస్తావన లేని సీన్లు అరుదుగా కనిపిస్తాయి. డైలాగులు ఆశ్చర్యపరిచేలా.. హార్డ్ హిట్టింగ్‌గా ఉన్నాయి. కృష్ణమ నాయుడు.. రామిరెడ్డిల కాలేజీ జీవితం వరకు సాగే సన్నివేశాలు కొంచెం అటు ఇటుగా అనిపించినా.. వారి రాజకీయ ప్రయాణం మొదలయ్యాక 'మయసభ'లో వేగం పెరుగుతుంది. ఇందిర చుట్టూ తిరిగిన ఢిల్లీ రాజకీయాలు.. ప్రభుత్వాలను నిలబెట్టడంలో- పడగొట్టడంలో ఆమె చాణక్యం.. ఆంధ్రప్రదేశ్ నాయకులతో ఇందిర-సంజయ్ గాంధీ ఆడుకున్న తీరును ఇందులో చాలా ఎఫెక్టివ్ గా చూపించారు. ఎమర్జెన్సీ సీన్లు మాత్రం కొంచెం అనాసక్తికరంగా అనిపిస్తాయి. చివరి రెండు మూడు ఎపిసోడ్లలో ఇంటెన్సిటీ పెరుగుతుంది. ఎన్టీఆర్ పాత్ర ప్రవేశంతో సిరీస్ రసవత్తరంగా మారుతుంది. ఆ పాత్ర చుట్టూ తిరిగే చివరి ఎపిసోడ్ 'మయసభ'కు హైలైట్. శ్రీకాంత్ అయ్యంగార్ చేసిన నాదెండ్ల భాస్కరరావు పాత్రను వినోదాత్మకంగా మలిచారు. ఇంటెన్స్ గా సాగే సిరీస్ లో అది కొంచెం రిలీఫ్ లాగా అనిపిస్తుంది. 'మయసభ'లా అంతా సూపర్ అని చెప్పలేం. కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. మిగతా పాత్రలు.. వాటి వ్యవహారాలు బాగున్నా.. పరిటాల రవి-వంగవీటి రాధాల చుట్టూ తిరిగే సన్నివేశాలు మాత్రం అంత ప్రభావవంతంగా లేవు. ఇక 'మయసభ'లో అక్కడక్కడా కొంచెం సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నారు. చంద్రబాబు-వైఎస్ మధ్య నిజంగా అంత స్నేహం.. సమన్వయం ఉండేదా.. ఇద్దరూ అంత గొప్ప వాళ్లా అనిపించేలా ఆ పాత్రలను తీర్చిదిద్దారు. ఐతే ఈ ప్రతికూలతలున్నప్పటికీ.. ఉన్నంతలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ముఖ్యమైన నాయకులు.. అప్పటి కీలక పరిణామాల చుట్టూ ఎంతో ఆసక్తికరంగానే ఈ సిరీస్ సాగుతుంది. పొలిటికల్ డ్రామాలను ఇష్టపడేవారికి ఈ సిరీస్ నచ్చుతుంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

## జాతీయస్థాయిలో దృష్టిని ఆకర్షిస్తున్న..

# వెయ్యి రూపాయల కాయిన్ బొమ్మ!







భారత్‌లో ఒక కొత్త వెయ్యి రూపాయల నాణాన్ని ఈ మధ్య మన ప్రధాని మోడీ విడుదల చేశారు. ఆ నాణంపై ముద్రించేందుకు ఓ ఐకానికి పిక్చర్‌ను ఎంపిక చేశారు. ఏంటా హిస్టారికల్ పిక్చర్.. దాని కథ..?

2025 జూలై 27న ప్రధాని మోడీ తమిళనాడులోని గంగైకొండ చోళపురం బృహదీశ్వరాలయాన్ని సందర్శించారు. ఆ సందర్భంగా గంగైకొండ చోళపురం స్థాపకుడైన మొదటి రాజేంద్ర చోళుడి స్మారకార్థం కొత్త వెయ్యి రూపాయల నాణాన్ని ఆయన అదే రోజు విడుదల చేశారు. దాని వెనుక ఓ హిస్టారికల్ స్టోరీ ఉంది. గంగైకొండ చోళపురం మొదటి చక్రవర్తి రాజేంద్ర చోళుడి చారిత్రక నావికా దండయాత్ర చేసి వెయ్యేళ్లు కావడం.. గంగానదిని జయించి ఉత్తరభారతంపై విజయంతో గంగైకొండ చోళపురాన్ని నిర్మించడమే ఆ చరిత్ర. దాంతో ఆ నాణెంపై ముద్రించిన గంగైకొండ చోళపురం ఆలయానికి సంబంధించిన పిక్చర్ ఇప్పుడు జాతీయస్థాయిలో ఆసక్తి రేకెత్తించిన చర్చగా మారింది.

చోళుల కాలంలో నిర్మితమైన ఆలయాలు, కోటల శిల్పశైలి ఆకట్టుకునేది, అబ్బురపర్చేది. అదే సమయంలో వారి దండయాత్రలు చేసినప్పుడు వారు సముద్రమార్గంలో సాధించిన విజయాలు కూడా చరిత్రలో వారికి ప్రత్యేక స్థానాన్ని కట్టబెట్టాయి. ఇప్పటికే వారి నిర్మాణ కౌశలాన్ని అంతెత్తున చూపించే తంజావూర్ బృహదీశ్వరాయలం ఓ అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్నది. అయితే, ఇంచుమించి అదే తరహా నిర్మాణ శైలిని కలిగివుండే.. గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వరాలయం బొమ్మను వెయ్యి రూపాయల కాయిన్‌పై ముద్రించాక.. ఆ ఆలయ చరిత్ర, దాని సాంస్కృతిక వైభవం మరోసారి ప్రస్తావనలోకొచ్చింది.

### అసలేంటి గంగైకొండ చోళపురం ప్రత్యేకత..?

11వ శతాబ్దంలో చక్రవర్తి అయిన ఒకటో రాజేంద్ర చోళుడు.. తన తండ్రి ఒకటో రాజరాజ చోళుడు నిర్మించిన తంజావూర్‌లోని బృహదీశ్వరాలయానికి దీటుగా గంగైకొండ చోళపురంలో మరో బృహదీశ్వరాలయాన్ని నిర్మించాడు. ఇది యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించింది. చోళుల వాస్తుశిల్పం, ఇక్కడి హైడ్రాలిక్ డిజైనింగ్స్, పట్టణ ప్రణాళిక, వారి రాజ్యనైపుణ్యానికి ప్రతీకలుగా కనిపించే ప్రదర్శనకు ఓ ప్రతిరూపం గంగైకొండ చోళపురం. ఇక్కడి ఆలయంలో బృహదీశ్వరుడు, దుర్గ, పార్వతీ, మురుగన్ వంటి దేవతలు కొలువై ఉన్నారు. ఇక్కడ 63 మంది తమిళ శైవ సాధు కవులైన నాయన్మర్లు అమరత్వం చెందారు.

తంజావూర్ అంత భారీ ప్రతిరూపంలా ఈ ఆలయ నిర్మాణం ఉండదుగానీ.. గంగైకొండలో శిల్పం ఆకట్టుకునేది. ఇక్కడి చెక్కిన సంక్లిష్టమైన శిల్పాలను అర్థం చేసుకోవడమూ ఆ సవాలే. మనోహరంగా కట్టిపడేస్తూనే ఆలోచింపజేసే శిల్పకళ ఈ గంగైకొండలో కనిపిస్తుంది. పైగా ఆధ్యాత్మికంగా ఒక ప్రశాంతమైన శివాలయమిది. దక్షిణ భారతదేశంలో అతి పెద్ద శివలింగానికి కేరాఫ్‌గా కూడా ఈ గంగైకొండ చోళపురం ఆలయాన్ని చెప్పుకుంటారు.

### ఇంతకీ నాణెంపై ఏం ముద్రించారు..?

తమిళనాడు నుంచి ఆగ్నేయాసియా వరకూ చేరుకున్న రాజేంద్ర చోళుడి నావికా దండయాత్రను గుర్తు చేసేలా బొమ్మను కొత్త వెయ్యి రూపాయల నాణెంపై ముద్రించారు. ఆ సమయంలో భారతీయ పాలకులు సాధించిన అరుదైన ఫీట్ ఇది. రాజేంద్ర చోళుడి దండయాత్రలతో చోళుల ప్రభావం.. ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్, కాంబోడియా వరకూ విస్తరించింది. శతాబ్దాల కాలం నుంచి ఆ దేశాలతో వాణిజ్యం, దౌత్య సంబంధాలకు గట్టి పునాదులు వేసింది.

### ఆది తిరువతిరై ఉత్సవం రోజునే నాణెం విడుదల!

ప్రతీ ఏటా ఆది తిరువతిరై ఉత్సవాన్ని ఒకటో రాజేంద్ర చోళుడి జయంతిని పురస్కరించుకుని జరుపుతుంటారు. ఈసారి 2025 జూలై 23 నుంచి 27 వరకు ఈ ఉత్సవాన్ని ఆయన వెయ్యో జన్మదినం సందర్భంగా మరింత వైభవంగా నిర్వహించగా.. ఈ కార్యక్రమం చివరి రోజునే ప్రధాని నరేంద్రమోడీ ఈ ఆలయాన్ని సందర్శించి వెయ్యి రూపాయల నాణాన్ని విడుదల చేశారు.

### గంగైకొండ చోళపురం ఆలయం ఎక్కడ ఉంది?

తమిళనాడు అరియలూర్ జిల్లాలో గంగైకొండ చోళపురం ఆలయం ఉంది. చెన్నై నుంచి సుమారు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి.. తిరుచ్చి, కుంభకోణం వంటి క్షేత్రాల నుంచి రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు. గంగైకొండ చోళపురం అనే పేరు వెనుక కూడా ఓ కథ చెబుతుంటారు. గంగానదిని జయించి.. ఆ నీటిని తీసుకొచ్చి.. చోళుల కొత్త రాజధానిగా రాజేంద్ర చోళుడు నిర్మించాడు కాబట్టే ఈ నగరానికి గంగైకొండ అనే పేరు వచ్చిందంటారు.





అందుకే, ప్రధాని మోడీ కూడా గంగాజలం తీసుకొచ్చి ఇక్కడ అభిషేకం చేయించారు. ఉత్తర భారతదేశంపై రాజేంద్ర చోళుడు సాధించిన ప్రతీకాత్మక విజయాన్ని ఈ గంగైకొండ చోళపురం సూచిస్తుంది.

వెయ్యి రూపాయల నాణెంపై గంగైకొండ చోళుడి నావికా దండయాత్ర బొమ్మను ముద్రించడమనేది తమిళనాడు రాష్ట్ర చారిత్రక వారసత్వాన్ని ప్రతిబింబించేది. దాని విశేషాల్ని మరింతగా ప్రపంచ దృష్టికి తీసుకెళ్లేది. ఇప్పుడు చాలామంది సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యటనలు చేయాలనుకునేవారి చూపును కూడా ఈ క్షేత్రం తన వైపు మళ్లిస్తోంది. భారతదేశ సముద్ర దండయాత్రల్లో భారతదేశంలోనే చోళుల యుగం ఓ స్వర్ణయుగంగా కూడా చెబుతుంటారు.

### గంగైకొండ చోళపురం ఆలయ సందర్శన ఎలా మరి..?

అక్టోబర్ నుంచి మార్చి వరకు ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. సందర్శకులెవ్వరైనా ఉచిత దర్శనానికి అవకాశముంది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకూ కూడా ఈ ఆలయం తెరిచే ఉంటుంది. దీని సమీపంలోనే బృహదీశ్వరాలయం, ఐరావతేశ్వరాలయం, స్వామిమలై వంటి ప్రముఖ ఆలయాలు ఆకట్టుకునేవి.


**- బాతాఖానీ సౌజన్యంతో..**

---

## ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తాం

**(సత్యంన్యూస్, టెక్కలి)**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు అందాయన్నారు. నూతన ఫించన్లు మంజూరు చేయాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయన్నారు. త్వరలో మంజూరు చేస్తామని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడి త్వరిగతిన ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులలో అలసత్వం లేకుంగా అధికారులు పనిచేయాలని సూచించారు.



## శ్రీకాకుళంలో "జ్ఞాన ప్రవచన యజ్ఞం"

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



శ్రీకాకుళంలో ఉపనిషత్, మహాభారతంపై, జ్ఞాన ప్రవచన యజ్ఞం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరగనున్నాయని చిన్మయ మిషన్ నిర్వాహకులు, స్వామి పరాత్మానంద సరస్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం స్థానిక బాపూజీ కళామందిరంలో ఆగస్టు 18 నుండి 23 వరకు జారుతాయని, ఢిల్లీ చిన్మయ మిషన్ నిర్వాహకులు, స్వామి చిద్రూపానంద సరస్వతి ఆధ్వర్యంలో ఉదయము ఉపనిషత్తు, సాయంత్రం మహాభారతము, ప్రవచనము జరుగుతాయన్నారు. మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఐదున్నర గంటలకు శోభాయాత్ర, స్థానిక ఏడురోడ్ల కూడలినుండి బాపూజీ కళామందిర్ వరకు కొనసాగుతుందని, నగర ఆధ్యాత్మిక ప్రేమికులు, సేవకులు పాల్గొని, భగవంతుని కృపకు పాత్రులు కాగలరన్నారు.

## 11న వాలీబాల్, కబడ్డీ జట్ల ఎంపిక

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

శ్రీకాకుళం జిల్లా 75 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్, కబడ్డీ (పురుషుల) జట్ల ఎంపికను ఈనెల 11న నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపికలలో పాల్గొనదలచిన ఆసక్తిగల క్రీడాకారులు తమ నియోజకవర్గానికి సంబంధించిన ఇన్‌చార్జులను సంప్రదించాలని సూచించారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి కేఆర్ స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఈ నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా ఎస్.శ్రీనివాసరావు (9441914214), ఎచ్చెర్లకు ఎస్.సూరిబాబు (9440255255), ఆమదాలవలసకు బి.సురేష్ (9440001190), నరసన్నపేట (ఎస్.లక్ష్మణరావు -6301131239), టెక్కలి (నారాయణ-9502983175), పలాస (సిహెచ్. పద్మలోచన రావు-9492419416), కొరసవాడ(9494164246),పాతపట్నం / ఇచ్ఛాపురం (పద్మనాభ రెడ్డి-9441024555)లను సంప్రదించాలని సూచించారు. పాల్గొనదలచిన క్రీడాకారులు నిర్ణీత సమయానికి, తమ గుర్తింపు పత్రాలతో సహా హాజరు కావాలన్నారు. వేదిక, ఇతర వివరాలకు ఆయా ఇన్‌చార్జ్‌లను సంప్రదించాలన్నారు.

## ప్రతిభగల క్రీడాబృందం "తుంగభద్ర వారియర్స్"

**(సత్యంన్యూస్, విశాఖపట్నం)**

ప్రతిభగల క్రీడాబృందం "తుంగభద్ర వారియర్స్" అని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. విశాఖ వేదికగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీలు అంగరంగ వైభోగంగా శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా హోటల్ గ్రీన్ పార్క్‌లో మీటింగ్ విత్ గ్రీటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాటాడుతూ తుంగభద్ర వారియర్స్ యాజమాని శేషు తనకు చిరకాల మిత్రుడన్నారు. ఈ ఫ్రాంచైజీలో క్రీడాకారులందరూ ప్రతిభకలవారని, రకరకాల వేదికలలో వీరంతా రాణించి తిరుగులేని విజేతలుగా నిలిచిన వారన్నారు. తప్పకుండా ఈ పోటీలలో విజయడంకా మ్రోగిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, క్రీడా శాఖా మంత్రి సహకారంతో కొత్త తరహా క్రీడలు మొదలవుతున్నాయన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు ప్రొత్సాహాన్ని అందిస్తామని, ప్రతీ జిల్లాలో ఒక స్టేడియం నిర్మించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారని, దేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేక స్థానం సంపాదిస్తుందని, ప్రతీ క్రీడాకారునికి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర వారియర్స్ సభ్యుల బృందం, యాజమాన్యం, టీడీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



## సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

శ్రావణమాసం మూడవ శుక్రవారం పర్వదినం సందర్భంగా శ్రీకాకుళంలో కొలువై ఉన్న జగన్మాత శ్రీ సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున రెండు గంటల నుండి సుప్రభాత సేవ, క్షీరాభిషేకం సేవ, విశేష పుష్పాలంకరణ సేవ, శ్రీ సూక్తం విధానముగా షోడశోపచార సహిత సహస్రనామార్చన, కుంకుమపూజ, అమ్మవారి జపం, అష్టోత్తర శతనామార్చన కుంకుమ పూజ, శ్రీ దేవీ ఖడ్గమాలతో కుంకుమ పూజ, లక్ష కుంకుమార్చన సేవ, శ్రీ సూక్తము పారాయణం దుర్గా సూక్తం పారాయణ, శ్రీ కనకధారా స్తోత్రము పారాయణం, వరలక్ష్మి వ్రతములు, ప్రత్యేక పూజలు అర్చనలు లలితా సహస్రనామ పారాయణం, విశేష అర్చనలు, మహా నివేదన, నీరాజనం మంత్రపుష్పము, మహా హారతి, వేద పారాయణం, వేద ఆశీర్వచనాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వారికి తాగునీటి సదుపాయం, ప్రసాదాలు అందజేశారు. భక్తులు కుంకుమపూజలు జరిపించుకున్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి మునగవలస సుకన్య తదితరులు పాల్గొన్నారు.

















## సంతోషిమాత ఆలయంలో
# విద్యార్థులతో పూజలు



**(సత్యంన్యూస్, రాజాం)**

కొత్తవలస గ్రామంలోని జైసంతోషిమాత ఆలయ 30వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ విద్యార్థులతో సరస్వతి పూజ, సహస్ర కుంకుమార్చన, లక్ష్మీగణపతి యజ్ఞం నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, సుస్థిరస్థానంలో నిలవాలని పూజలు జరిపినట్లు ఆలయ అర్చకులు ఎం.రవిప్రసాద్ శర్మ తెలిపారు. పూజ అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఇందులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త కొయ్యాన సీతారాం, గ్రామ ప్రజలు, అభ్యాసం పాఠశాల తరపున పుస్తకాలు, పెన్నులు, పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు, జిల్ ఫౌండేషన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# కప్పం కాసులవాడు.. ఈ శ్రీనివాసుడు!

(మొదటిపేజీ తరువాయి)

లంచం తీసుకుంటుండగా ఈఎన్‌సీ శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించారు.

### లంచంతోపాటు వ్యాపార లాభం


పేరులో గిరిజనాన్ని పెట్టుకున్న సంక్షేమ శాఖలో రూ.35.5 కోట్ల బిల్లులకు రూ.5 కోట్ల లంచమా అని రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ అధికారులు నోరెళ్లబెడుతున్నారు. ఈ స్థాయిలో లంచాలుంటాయని తెలియక అనవసరంగా తక్కువ డబ్బులకే బిల్లులు చేసేస్తున్నామని కొన్ని డిపార్ట్‌మెంట్ల సిబ్బంది తెగ బాధపడిపోతున్నారు ఫీలవుతున్నారు కూడా. వాస్తవానికి ఈఎన్‌సీ శ్రీనివాస్ డిమాండ్ చేసిన రూ.5 కోట్ల మొత్తం ఒక్క లంచానికి సంబంధించినది మాత్రమే కాదని తెలిసింది. ఆయన్ను పట్టించిన సత్యసాయి కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులతో ఈఎన్‌సీ శ్రీనివాస్‌కు తెరవెనుక వ్యాపార భాగస్వామ్యాలు ఉన్నాయని ఎప్పట్నుంచో ఓ టాక్ ఉంది. ఈ సంస్థ ద్వారా శ్రీనివాస్ గిరిజన సంక్షేమ శాఖలో కాంట్రాక్ట్‌లు చేయడంతో పాటు విశాఖపట్నం వంటి సిటీల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నారని భోగట్టా. ఇప్పుడు ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాలకు సంబంధించి తాను తెర వెనుక పెట్టిన పెట్టుబడులపై లాభంతో పాటు బిల్లులు చెల్లించడానికి ఈఎన్‌సీ హోదాలో లంచంతో కలుపుకొని రూ.5 కోట్లు డిమాండ్ చేసినట్లు చర్చ జరుగుతోంది. ఈఎన్‌సీ శ్రీనివాస్ స్వభావమే ఇందుకు కారణం.

### రాజకీయంగానూ బలవంతుడే

ఎమ్మెల్యేలంటే ఈఎన్‌సీ శ్రీనివాస్‌కు ఏమాత్రం ఖాతరు లేదు. కేబినెట్‌లో ఉన్నవారి అండదండలు తనకు ఉన్నాయన్న ధైర్యంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలను ఆయన ఏరోజూ పట్టించుకోలేదు. శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లోనే వందకు పైగా పనులు మధ్యలో ఆగిపోవడమే దీనికి నిదర్శనం. తనకు వాటాలు అందని ప్రతి పనిని ఆయన మధ్యలోనే నిలిపేశారు. దీనివల్ల ప్రజాప్రతినిధులుగా తమకు చెడ్డపేరు వస్తుందని, పనులు కొనసాగించాలని ఎమ్మెల్యేలు ఎన్నిసార్లు మొత్తుకున్నా శ్రీనివాస్ ఎన్నడూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో గానీ, గత ప్రభుత్వంలో గానీ ఆయన పంపిన డబ్బులు తిన్న ఎమ్మెల్యేలు గమ్మున కూర్చుంటే.. ఈయన అరాచకాన్ని తట్టుకోలేనివారు ఫిర్యాదులు చేశారు. అయినా ఫలితం దక్కలేదు. పోస్టులు కూడా అప్పనంగా దక్కించుకున్నారు. ఈఈగా ఉంటూనే పూర్తి అదనపు బాధ్యతలతో ఎస్ఈ పోస్టు చూశారు. ఎస్ఈగా ఉంటూనే పూర్తి అదనపు బాధ్యతలతో ఈఎన్‌సీగా వెలగబెడుతున్నారంటే ఆయన రాజకీయంగా ఎంత బలవంతుడో అర్థం చేసుకోవచ్చు. నెల రోజుల క్రితమే ఆయన రెగ్యులర్ ఈఎన్‌సీ అయ్యారు. ఏ పోస్టులో ఉన్నా కాంట్రాక్టర్లతో పాటు సొంత డిపార్ట్‌మెంట్‌లోనివారికి వేధింపులు తప్పేవికావని ఏసీబీ ట్రాప్ తర్వాత సిబ్బంది బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

### వసూళ్ల కోసమే రివర్షన్లు

సీతంపేట ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం ఈఈగా గతంలో పనిచేసిన రమాదేవి అక్కడి ఇంజినీరింగ్ వ్యవస్థను పూర్తిగా గాడిలో పెట్టారు. అదే సమయంలో ఇక్కడ జరుగుతున్న పనులకు సంబంధించి రూ.70 లక్షలు తనకు పంపించాలని ఆమెను శ్రీనివాస్ డిమాండ్ చేశారని తెలిసింది. అయితే అది తనవల్ల కాదని తెగేసి చెప్పడంతో ఆమెను ఆకస్మికంగా నెల్లూరుకు బదిలీ కొట్టారు. కానీ కోర్టు ఉత్తర్వులు తెచ్చుకుని రమాదేవి సీతంపేట ఈఈగా వచ్చి కూర్చున్నారు. అలాగే అల్లూరి మన్యం జిల్లా (పాడేరు) ఈఈగా పని చేస్తున్న దేవిడ్‌రాజుకు శ్రీనివాస్ నరకం చూపించారు. ఫోకల్ సీటులోకి పంపాలంటే తనకు కప్పం కట్టాలంటూ ప్రమోషన్లను తారుమారు చేసిన ఘనత శ్రీనివాస్‌దే. డీఈలను జేఈలుగాను, ఈఈలను డీఈలుగాను రివర్షన్లు ఇచ్చేసి మళ్లీ సేమ్ పోస్టు కావాలంటే సొమ్ములివ్వాలని డిమాండ్ చేసేవారని తెలిసింది. ఇప్పుడు సత్యసాయి కన్‌స్ట్రక్షన్స్‌లో ఈఎన్‌సీ తెరవెనుక పార్టనర్‌గా కొనసాగుతున్నారనే ఆరోపణలుండగా, మరో కన్‌స్ట్రక్షన్ కంపెనీ దత్తసాయితో ఈయనకు తీవ్ర స్థాయిలో విభేదాలున్నాయి. కురపాం, భామిని మండలాల్లో చేసిన పనులకు వారికి బిల్లులు చెల్లించకపోగా తిరిగి వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. దాంతో సదరు కంపెనీ కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. గిరిజన సంక్షేమ శాఖలో ఇంత భారీ స్థాయిలో అవినీతి జరగడానికి ప్రధాన కారకుడు శ్రీనివాసేనని చెప్పుకుంటున్నారు. గతంలో ఆయన శ్రీకాకుళం ఈఈగా పని చేసినప్పుడు ఐటీడీఏ కార్యాలయంలో గొండు సోమేశ్వరరావు అనే జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు. అలాగే 2001లో ఈయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ఏసీబీ నమోదు చేసింది. అసలు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పూర్తిగా పనులు చేయకుండానే బిల్లులు పెడుతున్నారా? లేక ఈఎన్‌సీకి భయపడి అంత మొత్తంలో లంచాలు చెల్లించుకుంటున్నారా? తేల్చడానికి ప్రభుత్వం సిద్ధపడుతోంది.




## బోస్టన్‌లో ముగిసిన కూన పర్యటన

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అమెరికాలోని బోస్టన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రతిష్టాత్మక ఎన్‌సీఎస్ఎల్ 50వ సదస్సులో రాష్ట్రం నుంచి పాల్గొన్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పర్యటన మిగిసింది. చివరి రోజు మీటింగ్ బోస్టన్ స్టేట్ పార్లమెంటరీ హౌస్ వద్ద పలు దేశాలకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం ఎన్ఎల్‌సీ ప్రెసిడెంట్ రాహుల్ కరాడ్ నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక సదస్సులో పాల్గొనడం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నామన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో ఆధునిక రాజకీయ విధానాలను, అమెరికాలోని పొలిటికల్ సిస్టంను విశ్లేషించే గొప్ప వేదికగా ఈ సదస్సు నిలిచిందన్నారు. మూడు రోజుల సదస్సు ఎంతో విశిష్టత కలిగిందని, మరిచిపోలేను అనుభూతినిచ్చిందని తెలియజేశారు.





## జిల్లా 75వ ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆగస్టు 13 నుండి 15 వరకు జరిగే వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతుంది గురువారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన ఈ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష జరిగింది. ఇందులో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా ఉన్నతాధికారులు వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు జిల్లాలోని సాంస్కృతిక, చారిత్రిక ఆదివాసి వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలన్నారు. శోభాయాత్రకు బదులు 5వేల మందితో మారథాన్ యువజన క్రీడలు, సమ్మిటి విద్యార్థుల కోసం చరిత్ర క్విజ్ వ్యాసరచన పోటీలు, పైలాన్ ప్రారంభోత్సవం ఆదివాసి కలల ప్రదర్శనలు సాంస్కృతి కార్యక్రమాలు, డ్వాక్రా బజార్ ఫుడ్ స్టాల్ వంటివి ప్రధానాకర్షణగా ఉండనున్నాయన్నారు. ప్రత్యేకంగా జిల్లాకే తలమానికంగా నిలిచే వంటలు మన జిల్లాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచే గ్రామీణ పోటీలు నిర్వహించడం కోసం కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొననున్న ఈ ఉత్సవాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, భద్రత మెడికల్, త్రాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని జెసి ఆదేశించారు, జిల్లా ప్రత్యేకతలను సాంస్కృతిలో ప్రతిపంపించేలా ప్రతీ కార్యక్రమం ఉండాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ సావనీర్ కమిటీ సాంస్కృతిక కమిటీ ఆదిత్య కమిటీలను ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉమారుద్ర కోటేశ్వరాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యునిగా కోరాడ రమేష్‌ను నియమించిన సందర్భంగా శుక్రవారం ఆయన ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి అభినందించారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం

# 14 వేలకే పుదుచ్చేరి, చిదంబరం, మహాబలిపురం టూర్!!

**ఇంటర్నెట్ డెస్క్:** తమిళనాడులోని పుదుచ్చేరి, మహా బలిపురం ప్రాంతాల్లోని దేవాలయాలు, బీచ్‌లను చూసే విధంగా ఐఆర్‌సీటీసీ కొత్త టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది. 'కోస్టల్ చార్మ్ ఆఫ్ తమిళనాడు' పేరిట ఈ ప్యాకేజీని తెచ్చింది. ఈ యాత్రలో పుదు చ్చేరిలోని అరోవిల్, అరోబిందో ఆశ్రమం, ప్యారడైజ్ బీచ్, నటరాజ స్వామి దేవాలయం, పిచావరం మడ అడవులతో పాటు మహా బలిపురంలోని స్థానిక పర్యాటక ప్రాంతాలు చుట్టిరావచ్చు. ఈ యాత్ర మొత్తం 4 రాత్రులు, 5 పగళ్లు కొనసాగుతుంది. గద్వాల్, జడ్చర్ల, కాచిగూడ, కర్నూలు, మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్ల నుంచి ప్రతి గురు వారం ట్రైన్ అందుబాటులో ఉంటుంది. టూర్ ముగిశాక మళ్లీ ఆయా స్టేషన్లలో దిగే వెసులుబాటు ఉంది. ఆగస్టు 14 నుంచి సెప్టెం బర్ 25 వరకు ప్రయాణానికి టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

### ప్రయాణం ఇలా..

కాచిగూడలో ప్రతి గురువారం సాయంత్రం 5 గంటలకు రైలు ప్రారంభమవుతుంది. రాత్రంతా ప్రయాణించాల్సి ఉంటుంది.

రెండో రోజు ఉదయం 11.05 గంటలకు పుదుచ్చేరి స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి హోటల్‌కు తీసుకెళ్తారు. ఆ రోజు అరోవిల్, ఆరోబిందో ఆశ్రమం, పారడైజ్ బీచ్ వీక్షించడంతో రోజు పూర్తవుతుంది. రాత్రి పుదుచ్చేరిలోనే బస ఉంటుంది.

మూడో రోజు హోటల్లో బ్రేక్‌ఫాస్ట్ చేసి.. అక్కడి నుంచి 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిదంబరంలోని నటరాజ స్వామి దేవాలయం, పిచావరం మడ అడవులను చూపిస్తారు. ఆ తర్వాత పుదుచ్చేరికి తిరిగి ప్రయాణం ఉంటుంది. అక్కడ కాసేపు షాపింగ్ చేసుకోవచ్చు (మీ సొంతంగా). మళ్లీ పుదుచ్చేరిలోనే బస ఉంటుంది.

నాలుగో రోజు హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేశాక మహాబలిపురానికి ప్రయాణం ఉంటుంది. అక్కడ పాండవ రథాలు, సముద్రతీరంలోని ఆలయాన్ని సందర్శిస్తారు. తర్వాత చెంగల్పట్టుకు తీసుకెళ్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అక్కడి నుంచి కాచిగూడకు తిరిగి ప్రయాణం ఉంటుంది.

ఐదో రోజు ఉదయం 7.50 గంటలకు కాచిగూడ చేరుకోవడంతో యాత్ర పూర్తవుతుంది.

### ప్యాకేజీ ఛార్జీలు..

కంఫర్ట్‌లో (3ఏసీ) ఒక్కో ప్రయాణికుడు రూమ్ డబుల్ షేరింగ్‌లో అయితే రూ.20,650, ట్రిపుల్ షేరింగ్‌కు రూ.16,770 చెల్లించాలి. 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు విత్ బెడ్‌కు రూ. 12,320, విత్ అవుట్ బెడ్ అయితే రూ.8,830 చెల్లించాలి.

స్టాండర్డ్‌లో (స్లీపర్) ఒక్కో ప్రయాణికుడు రూమ్ డబుల్ షేరింగ్‌లో అయితే రూ.18,500, ట్రిపుల్ షేరింగ్‌కు రూ.14,620 చెల్లించాలి. 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు విత్ బెడ్ అయితే రూ.10,170, విత్ అవుట్ బెడ్‌కు రూ.6,670 చెల్లించాలి.

### ఇవి ప్యాకేజీలో భాగమే..

ఎంచుకున్న ప్యాకేజీని బట్టి రైళ్లో 3 ఏసీ, స్లీపర్ క్లాస్ ప్రయాణం

ప్యాకేజీని బట్టి ప్రయాణానికి ఏసీ వాహనం

పుదుచ్చేరిలో 2 రాత్రులు ఉండడానికి వసతి, ఉదయం అల్పాహారం ఉచితం

### యాత్రికులకు ట్రావెల్ ఇన్సూరెన్స్

టోల్, పార్కింగ్ ఛార్జీలు వంటివి ప్యాకేజీలో భాగమే.

### వీటి బాధ్యత యాత్రికులదే

మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం వంటివన్నీ యాత్రికులే చూసుకోవాలి. పర్యటక ప్రదేశంలో ఎక్కడైనా ప్రవేశ రుసుములు ఉంటే వ్యక్తులే చెల్లించాలి.


బోటింగ్, హార్స్ రైడింగ్ వంటివి ప్యాకేజీలో ఉండవు. గైడ్‌ను యాత్రికులే ఏర్పాటు చేసుకోవాలి.

**ఈ టూర్‌కు సంబంధించి మరిన్ని వివరాలు, బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సందర్శించండి.**

## ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రతీ సమస్యకు, పరిష్కార మార్గం చూస్తానని, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం అన్నారు. స్థానిక విశాఖ కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ఊహించని వినతులు శుక్రవారం అందాయి. శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార, ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సంప్రదించి, సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వము ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తుందని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, రూరల్, గార, పరిసర గ్రామ ప్రజలు, టీడీపీ నగర నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్ఛార్జ్‌లు పాల్గొన్నారు.



## సంతోషిమాత దేవాలయంలో అన్నప్రసాదవితరణ

**(సత్యంన్యూస్, రాజాం)**

సంతోషిమాత 30వ వార్షికోత్సవం సందర్భంగా మండలం కొత్తవలస గ్రామంలో విద్యార్థులందరితో శుక్రవారం సరస్వతి పూజ, సహస్ర కుంకుమార్చన, లక్ష్మి గణపతి యజ్ఞం నిర్వహించామని, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సుస్థిరస్థానంలో నిలవాలని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశామని ఆలయ అర్చకులు ఎం.రవిప్రసాద్‌శర్మ అన్నారు. పూజ అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ చేపట్టామని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని, ఆలయ ధర్మకర్త కొయ్యాన సీతారాం, గ్రామ ప్రజలు, అబ్యాసం పాఠశాల తరుపున పుస్తకాలు, పెన్నులు, పరీక్షా సామాగ్రి అందజేశారన్నారు. అన్నప్రసాదంలో భాగంగా గ్రామ, మండల పరిధి భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ సాయి తదితరులు పాల్గొన్నారు.



## వజ్రోత్సవ వేడుకల బ్రోచర్ విడుదల

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జిల్లా వజ్రోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం ఇంటాక్ శ్రీకాకుళం బృందం రూపొందించిన వజ్రోత్సవ వేళ దర్శనీయ ప్రదేశాలు అనే బ్రోచర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, ఇతర జిల్లా అధికారులు విడుదల చేశారు. ఈ బ్రోచర్‌లో శ్రీకాకుళం జిల్లాలో పేరెన్నికగన్న దర్శనీయ స్థలము నుండి సాధారణ ఆకర్షణీయ స్థలాల వరకు 114 ప్రదేశాల వివరాలను పొందుపరిచారు. వాటిని జిల్లా ప్రజానీకానికి తెలియచేసే ఆలోచనతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అన్ని ప్రదేశాలను ఈ బ్రోచర్‌లో సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రోచర్ వివరాలను అదనపు కన్వీనర్ ఇంటాక్ వావిలపల్లి జగన్నాథనాయుడు కలెక్టర్‌కి ఇతర అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, కో కన్వీనర్ నాటుకుల మోహన్, సీనియర్ మెంబర్ బి.జగన్మోహనరావు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.